సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 16 । డిసెంబర్ । 2023



'గుర్తింపు' తప్పనిసరి

మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించాలంటే ఏదైనా ధ్రువీకరణ పత్రం చూపాల్సి ఉంటుంది. 9లో



హోరాహోరీగా క్రీడాపోటీలు

ఉమ్మడి జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
28° / 18°

జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. రాత్రి వేళ చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ: మండలంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. మేళతాళాల నడుమ అమ్మవారికి పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం పంచ హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈఓ రజినికుమారి పూజాది కార్యక్రమాలను పర్యవేక్షించగా, ధర్మకర్తల మండలి సభ్యులు చింతా నాగరాజు, గంధం వెంగళరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సాహిత్య కళా ఉత్సవాలు

టేకులపల్లి: శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16,17 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించే నెలనెలా శతాధిక కవి సమ్మేళనం, కళా రూపాల ప్రదర్శనను జయప్రదం చేయాలని టేకులపల్లికి చెందిన శ్రీశ్రీ కళా వేదిక భద్రాద్రి జిల్లా కమిటీ సభ్యుడు చంద్ర వెంకటేశ్వరరావు కోరారు. ఉత్సవాలకు హాజరయ్యే కవులు, రచయితలు, కళాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు శ్రీమద్భగవద్గీత కంఠస్థం పోటీలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ కె.రామకృష్ణారెడ్డి తెలిపారు. భద్రాద్రి జిల్లా విద్యార్థులకు కొత్తగూడెంలోని శ్రీ శారద విద్యాలయంలో ఈనెల 19న, ఖమ్మం జిల్లా విద్యార్థులకు ఈనెల 23న ఖమ్మంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. శ్రీమద్భగవద్గీత మూడో అధ్యాయం కర్మయోగంలోని 1 నుంచి 30 శ్లోకాలు, సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం భద్రాద్రి జిల్లా విద్యార్థులు 93948 61212నంబర్‌కు, ఖమ్మం జిల్లా విద్యార్థులు 93916 40782 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రత్యేక అధికారుల నియామకం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ప్రియాంక అల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు, మండలాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వీరే..	
పినపాక	జి.మధుసూదన్‌రాజు
ఇల్లెందు	జె.కాశయ్య
కొత్తగూడెం	ఆర్.శిరీష
అశ్వారావుపేట	కె.మాధవి
భద్రాచలం	ఎం.మంగీలాల్
మండల ప్రత్యేక అధికారులు	
ఆళ్లపల్లి	జి.వెంకటేశ్వరరెడ్డి
అన్నపురెడ్డిపల్లి	డి.అనసూర్య
అశ్వాపురం	బి.వీరన్న
అశ్వారావుపేట	డాక్టర్ బి.పురందర్
భద్రాచలం	బి.నాగలక్ష్మి
బూర్గంపాడు	తిరుమలేష్
చండ్రుగొండ	కె.సంజీవరావు
చర్ల	కె.అభిమన్యుడు
చుంచుపల్లి	బి.సులోచనారాణి
దమ్మపేట	ఎస్.శ్రీనివాసరావు
దుమ్ముగూడెం	ఎం.పరంధామరెడ్డి
గుండాల	ఎన్.వెంకటేశ్వర్లు
జూలూరుపాడు	బి.భీంలాల్
కరకగూడెం	జైసింగ్
లక్ష్మీదేవిపల్లి	కె.మనోహర్
మణుగూరు	ఎంఏ.అలీం
ములకలపల్లి	ఎం.బాలు
పాల్వంచ	టి.సీతారాంనాయక్
పినపాక	హెచ్‌వి.రాంప్రసాద్
సుజాతనగర్	ఎస్.త్రినాథ్‌బాబు
టేకులపల్లి	వి.విజేత
ఇల్లెందు	జి.మరియన్న
కొత్తగూడెం	బి.అర్జున్

పార్లమెంట్‌పై ఫోకస్!

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై బీజేపీ సమీక్ష

- కమలనాథులకు ఆశించిన స్థాయిలో దక్కని ఓట్లు
- లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై పార్టీ కసరత్తు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన చేదు ఫలితాలపై సమీక్షించుకోవడంతోపాటు రాబోయే పార్లమెంటు ఎన్నికలపై కమలనాథులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో పార్టీ పరంగా సమీక్షకు సిద్ధమయ్యారు.

పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి

జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో జనరల్ స్థానమైన కొత్తగూడెం, అశ్వారావుపేట (ఎస్టీ)లు ఖమ్మం పార్లమెంటు పరిధిలో ఉన్నాయి. మిగిలిన ఇల్లెందు (ఎస్టీ), పినపాక (ఎస్టీ), భద్రాచలం (ఎస్టీ) స్థానాలు మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ తప్పకుండా ప్రభావం చూపించగలదనే అంచనాలు ఆ పార్టీ నేతల్లో ఉన్నాయి. అందుకు తగ్గట్టే ఈ రెండు స్థానాలకు సంబంధించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సరైన అభ్యర్థులను ఎంపిక చేసే అంశంపై పార్టీ దృష్టి సారించింది.

- ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎస్టీ నియోజకవర్గాల్లో బీజేపీ నాలుగు స్థానాలు గెలుపొందింది. ఇదే ఊపులో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ స్థానం నుంచి గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ నేతలు వ్యూహ రచన చేస్తున్నారు. మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుంచి గతంలో పోటీ చేసిన జాటోతు హుస్సేన్‌నాయక్‌తో పాటు ఇటీవల ఇల్లెందు నుంచి అసెంబ్లీకి పోటీ చేసిన మాజీ ఎంపీ రవీంద్రనాయక్ టికెట్ ఆశిస్తున్నారు. వీరిద్దరితో పాటు డోర్నకల్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి సైతం బీజేపీ నుంచి పోటీకి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ముగ్గురితో పాటు రాబోయే రోజుల్లో పరిస్థితులను బట్టి కొత్త పేర్లను సైతం పరిశీలించేందుకు ఆ పార్టీ పెద్దలు సిద్ధంగా ఉన్నారు.
- ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి గత ఎన్నికల్లో బీజేపీ తరఫున వాసుదేవరావు పోటీ చేశారు. ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత పార్లమెంట్ పరిధిలో పార్టీ అంశాల పట్ల ఆయన అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకే చెందిన పొంగులేటి సుధాకర్‌రెడ్డికి బీజేపీ అగ్రనాయకత్వం దగ్గర పలుకుబడి ఉంది. ప్రస్తుతం తమిళనాడు ఇన్‌చార్జిగా అక్కడ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పొంగులేటి ఇద్దరు జోడు గుర్రాల లాగా అక్కడ పార్టీలో నూతన ఉత్తేజం నింపుతున్నారనే అభిప్రాయం బీజేపీ పెద్దల్లో ఉంది. ఈ సమయంలో పొంగులేటి సుధాకర్‌రెడ్డి పార్లమెంట్‌కు పోటీ చేసే విషయంలో ఎంత మేరకు ఆసక్తి చూపిస్తారనేది ప్రశ్నార్థకం.
- ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి పోటీకి పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, బీసీ సామాజిక వర్గానికి చెందిన కేవీ రంగాకిరణ్ సైతం ఆసక్తి చూపిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి పోటీకి ఆయన ఆసక్తి చూపించారు. అయితే పొత్తులో ఆ స్థానం జనసేనకే కేటాయించడంతో నిరాశే ఎదురైంది. దీంతో ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో రంగాకిరణ్ పేరును ఖమ్మం స్థానానికి పరిశీలించేందుకు ఆస్కారం ఉంది. బీజేపీ వినిపిస్తున్న బీసీ నినాదం కూడా ఆయనకు కలిసిరావొచ్చు.

చేదు ఫలితాలు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి చేదు ఫలితాలు ఎదురయ్యాయి. జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇల్లెందు, భద్రాచలం, పినపాక స్థానాల నుంచి బీజేపీ పోటీ చేసింది. కొత్తగూడెం, అశ్వారావుపేటలను మిత్రపక్షమైన జనసేనకు కేటాయించింది. రెండు పార్టీలకూ ఒక్కచోట కూడా డిపాజిట్ రాకపోగా కనీసం మూడు వేల ఓట్లు కూడా పోలు కాలేదు. గరిష్టంగా పినపాక నుంచి పొడియం బాలరాజు 2,627 ఓట్లు సాధించారు. జనసేన అభ్యర్థులకు కూడా ఈ తరహా ఫలితాలే ఎదురయ్యాయి. జిల్లాలో గెలుపుపై బీజేపీకి అంచనాలు లేకున్నా గతంతో పోల్చితే ఓట్ల శాతం పెరుగుతుందని ఆ పార్టీ పెద్దలు ఆశించారు. కానీ ఎన్నికల ఫలితాలు వారి అంచనాలు తప్పని నిరూపించాయి. పైగా కొత్తగూడెం సీటును జనసేనకు కేటాయించడం వల్ల నష్టమే తప్ప లాభం ఏమీ ఒనగూరలేదన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో నెలకొంది.

ఆధ్యాత్మిక సందడి



బేడా మండపంలో ఆళ్వార్లతో కూడిన స్వామివారికి ప్రబంధాలు సమర్పిస్తున్న అర్చకులు

- మూడో రోజు వరాహావతారంలో రామయ్య దర్శనం
- శ్రీ సీతారామ చంద్రస్వామికి భక్తుల నీరాజనాలు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీ వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో శుక్రవారం మూడో రోజు స్వామివారు వరాహావతారంలో దర్శనమిచ్చారు. లోకకంటకుడైన హిరణ్యాక్షుడిని సంహరించి భూమిని తన కోరలతో పైకెత్తి లోకసంరక్షణ చేపట్టిన వరాహావతారంలో దర్శనమిచ్చిన రామయ్య స్వామికి భక్తులు నీరాజనాలు పలికారు. తెల్లవారుజామున ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి ఆరాధన, ఆరగింపు ఇచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోని బేడా మండపం వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం వేద పండితులు దివ్య ప్రబంధాలు పఠించారు. ఆ తర్వాత వరాహావతారంలో అలంకరించిన స్వామివారిని అంతరాలయం నుంచి బేడా మండపానికి తీసుకొచ్చి ఆళ్వార్లతో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు అనంతరం పల్లకీపై ఊరేగింపుగా మంగళవాయిద్యాలు, బాజా భజంత్రీలు, భక్తుల కోలాహలం నడుమ మిథిలా స్టేడియంలోకి తీసుకొచ్చారు. వేదికపై కొలువుదీర్చి, అర్చకులు హారతి ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం కోలాటాల నడుమ భక్తుల రామనామస్మరణలతో తిరువీధి సేవ సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నరసింహావతారంలో..

అధ్యయనోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు నర్సింహావతారంలో దర్శనమివ్వనున్నారు. కుజ గ్రహ బాధలు ఉన్నవారు నరసింహావతారాన్ని దర్శించుకుంటే విముక్తి పొందుతారని శాస్త్రం చెబుతుందని పండితులు పేర్కొంటున్నారు. తన ప్రియభక్తుడైన ప్రహ్లాదుని అనేక బాధలకు గురిచేస్తున్న హిరణ్యకశిపుడు అనే రాక్షసుడిని సంహరించడానికి నారాయణుడు నరసింహావతారాన్ని ధరించాడని, ఈ అవతార నిడివి స్వల్పకాల్పమైనా, భగవానుని సర్వవ్యాపకతను తెలియచేసిందని చెబుతున్నారు.



ఊరేగింపుగా తరలివస్తున్న స్వామివారు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి జనవరి 15 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు దరూరి గోదాలక్ష్మి బృందం ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాల కార్యక్రమం ఉంటుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో ఈ నెల 30న నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సూచించారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపౌండ్ కేసులను, ఈ-పిటీ కేసులను పరిష్కరించాలని చెప్పారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసుల్లో కక్షిదారులకు న్యాయం జరగాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, న్యాయమూర్తులు బత్తుల రామారావు, ఎ.సుచరిత, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, పీపీలు పోసాని రాధాకృష్ణమూర్తి, ఆర్.విజయ్‌కుమార్, వెలగల నాగిరెడ్డి, ఏపీపీలు లావణ్య, విశ్వశాంతి, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, న్యాయవాదులు కొత్తపల్లి రామారావు, గాదె రామచంద్రారెడ్డి, అంబటి రమేష్, మెండు రాజమల్లు పాల్గొన్నారు.

సింగరేణి బాస్‌లంతా రాజధానిలోనే!

- ఐదుగురు డైరెక్టర్లు, 10 మంది జీఎంలు ఆరు రోజులుగా అక్కడే..
- మరో వైపు సమీపిస్తున్న సింగరేణి డే, గుర్తింపు ఎన్నికలు



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉన్నతాధికారులు అందరూ హైదరాబాద్‌లోనే తిష్టవేశారు. కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు, వివిధ విభాగాల జీఎంలు విధులు నిర్వర్తిస్తారు. రోజూ పాలనావ్యవహారాలతోపాటు బొగ్గు ఉత్పత్తి, అమ్మకాలు, తరలింపు తదితర అంశాలపై పర్యవేక్షిస్తూ ఉంటారు. సంస్థలో వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. కానీ ఆరు రోజుల నుంచి వీరు లేకుండానే ప్రధాన కార్యాలయంలో కార్యకలాపాలు సాగుతున్నాయి. రాష్ట్రంలో ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో సింగరేణి అధికారులు రాజధానికే అంకితమయ్యారని కార్మిక వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ఈ నెల 23న సింగరేణి డే వేడుకలు నిర్వహించాల్సి ఉంది. ఆ తర్వాత నాలుగు రోజులకే 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వేడుకలు, పోలింగ్ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అయినా ఉన్నతాధికారులు హైదరాబాద్‌లోనే ఎందుకు తిష్టవేశారనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ నెల 31వ తేదీతో సింగరేణి సీఎండీ పదవీ కాలం కూడా ముగియనుంది. దీంతో ప్రస్తుత సీఎండీనే కొనసాగిస్తారా? మరో ఐఏఎస్ అధికారిని నియమిస్తారా? అనే విషయం కూడా తేలాల్సి ఉంది. ఈ క్రమంలో సంస్థ అకౌంట్లను పరిశీలిస్తున్నారా? అనే అనుమానం కూడా కార్మికవర్గాల్లో నెలకొంది.

ఎన్నికలు ఆపేందుకు టీబీజీకేఎస్ కుట్ర

- రూ. వేల కోట్లు లాక్కున్న గత రాష్ట్ర ప్రభుత్వం
- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

మణుగూరు టౌన్: కార్మిక వర్గాన్ని పదేళ్లుగా దోపిడీ చేసిన బీఆర్ఎస్, టీబీజీకేఎస్ మళ్లీ ఎన్నికలు ఆపేందుకు కుట్రలు చేస్తున్నాయని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. శుక్రవారం అడిషనల్ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య, జనరల్ సెక్రటరీ కొమిరి రాజ్ కుమార్‌తో కలిసి మణుగూరు పీవీకాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్, బొగ్గు బకాయిలు ఇవ్వకుండా గత ప్రభుత్వం రూ.వేల కోట్లు లాక్కున్న తీరును గమనించిన కార్మికులు మార్పును కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుతో సింగరేణి దివాళా తీసే పరిస్థితుల్లోకి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త గనులు, కార్మిక పరిరక్షణ, సింగరేణి అభివృద్ధి కోసం ఏఐటీయూసీని గెలిపించాలని కార్మికులు నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ తరుణంలో పదేళ్లుగా కనిపించకుండా పోయిన, టీబీజీకేఎస్‌లో చేరిన ఐఎన్‌టీయూసీ నాయకులు.. ఇప్పుడు బీఆర్ఎస్ ఓడిపోవడంతో మళ్లీ ఐఎన్‌టీయూసీలో కలుస్తున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా లేకపోయినా కార్మికుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని గుర్తుచేశారు. ఏఐటీయూసీ గెలిచే పరిస్థితి ఉండటంతో కొన్ని యూనియన్లు మళ్లీ కోర్టును ఆశ్రయించి ఎన్నికలు వాయిదా వేయాలని తాపత్రయ పడుతున్నాయని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు బి.అయోధ్య, బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మేకల ఈశ్వర్, జాయింట్ సెక్రటరీ పుల్లారావు, ఆవుల నాగరాజు, సుభానీ, నంబూరు శ్రీనివాసరావు, గోలీ గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విప్ నియామకాల్లోనూ నిరాశే

- జిల్లాకు దక్కని ప్రొటోకాల్ పదవి
- ఉమ్మడి జిల్లా నేతలపైనే బాధ్యతలన్నీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి ఏర్పడిన ప్రభుత్వంలోనూ భద్రాద్రి జిల్లా ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ పదవి అందని ద్రాక్షగానే మారింది. జిల్లా నుంచి అధికార కాంగ్రెస్ తరఫున ముగ్గురు ఎమ్మెల్యేలు ఎన్నికైనా కేబినెట్‌లో ఒక్కరికీ చోటు దక్కలేదు. చివరకు గత ప్రభుత్వం తరహాలో విప్ పదవైనా దక్కుతుందని ఆశించినా.. జిల్లా వాసులకు మరోసారి నిరాశే ఎదురైంది. తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం నలుగురు ఎమ్మెల్యేలకు విప్‌లుగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఈ నలుగురిలో జిల్లాకు చెందిన వారెవరు లేకపోవడం గమనార్హం

ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నా...

జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణతోపాటు జాతీయ పండుగలైన స్వాతంత్ర దినోత్సవం, రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా ప్రొటోకాల్ పదవులు ఉన్న ప్రజాప్రతినిధులే ముఖ్య అతిథులుగా హాజరవుతుంటారు. గత ప్రభుత్వంలో ఖమ్మం జిల్లాకు సంబంధించి మంత్రి హోదాలో పువ్వాడ అజయ్‌కుమార్, భద్రాద్రి జిల్లాకు సంబంధించి విప్ హోదాలో రేగా కాంతారావు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. ప్రస్తుతం జిల్లా నుంచి కోరం కనకయ్య (ఇల్లెందు), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), జారె ఆదినారాయణ (అశ్వారావుపేట) అధికార పార్టీ తరఫున ఎమ్మెల్యేలుగా ఉన్నారు. అయితే వీరిలో ఎవరికీ ప్రొటోకాల్ పదవులు దక్కలేదు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కేబినెట్‌లో స్థానం దక్కించుకున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలలో ఒకరు జిల్లాకు సంబంధించిన వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించే అవకాశం ఉంది.

'తొలిమెట్టు' సమర్థవంతంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెంఅర్బన్: తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, అమలు బాధ్యతను మండల నోడల్ అధి కారులు, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఆన్‌లైన్ మీటింగ్ ద్వారా జిల్లాలో అమలవుతున్న తొలి మెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలును సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకం, పీరియడ్ ప్లాన్, వర్క్ బుక్‌లను అనుసంధానిస్తూ బోధించాలని, పిల్లల్లో కనీస భాషా, గణిత సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాల్లో గ్రంథాలయ విని యోగం పెరగాలన్నారు. డీఆర్‌ఓ రవీంద్రనాథ్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్ పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాసం!

- కలెక్టర్, ఆర్‌డీఓలకు ఎంపీటీసీల లేఖ
- 14 మందిల్లో 11 మంది సభ్యుల అసంతృప్తి



కొత్తగూడెంలో ఆర్డీఓకు అవిశ్వాసం లేఖ అందజేస్తున్న ఎంపీసీటీ సభ్యులు

టేకులపల్లి: బీఆర్ఎస్ పార్టీకి చెందిన టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధపై 11 మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. ఈమేరకు శుక్రవారం అసమ్మతి ఎంపీటీసీలు కొత్తగూడెం వెళ్లి కలెక్టర్, ఆర్డీఓలకు అవిశ్వాసానికి సంబంధించిన లేఖలు అందజేశారు. ఆ తర్వాత టేకులపల్లి ఎంపీడీఓకు కూడా లేఖ ఇచ్చారు. 2019లో ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి పలు రాజకీయ సమీకరణలు చోటుచేసుకున్నాయి. మండలంలోని 14 ఎంపీటీసీ సభ్యుల్లో ప్రస్తుతం 11 మంది ఊకె రామకృష్ణ, జాల సంధ్య, ఉండేటి ప్రసాద్(వైస్ ఎంపీపీ), భూక్యా శంకర్, పూనెం స్వప్న, చింత శాంత కుమారి, బానోతు సరోజిని, బాణోతు పూర్ణ, బాణోతు మౌనిక, భట్టు శైలజ, వాంకుడోత్ ధనలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో ఉండగా, భూక్యా రాధ(ఎంపీపీ), జాలాది అప్పారావు, భూక్యా బాలకృష్ణ బీఆర్ఎస్‌లో మిగిలారు. గతంలోనూ బీఆర్ఎస్ మెజారిటీ ఉన్నప్పటికీ ఎంపీపీపై అవిశ్వాసం కోసం విఫలయత్నాలు జరిగాయి. తాజాగా ఇల్లెందులో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపొందడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ఇక్కడ మెజారిటీ సభ్యులు కాంగ్రెస్ వైపే ఉండటంతో అసమ్మతి ఎంపీటీసీలు ఎంపీపీని పదవి నుంచి దించేందుకు పావులు కదుపుతున్నారు.

పీఠం కోసం నలుగురు పోటీ

టేకులపల్లి ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని పూనుకున్న 11 మంది ఎంపీటీసీల్లో నలుగురు సభ్యులు నూతన ఎంపీపీ పదవికి పోటీపడుతున్నారు. బేతంపూడి ఎంపీటీసీ బానోతు పూర్ణ, తడికలపూడి ఎంపీటీసీ బానోతు మౌనిక, బద్దుతండా ఎంపీటీసీ ఊకె రామకృష్ణ, ప్రెగళ్లపాడు ఎంపీటీసీ బానోతు సరోజిని ఎంపీపీ పీఠంపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే తుది నిర్ణయం ఎమ్మెల్యే కోరం కనకయ్య తీసుకుంటారని, ఎమ్మెల్యే చెప్పిన వారికే ఎంపీపీ పదవి దక్కుతుందనే చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

బీటీపీఎస్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సీఈ బిచ్చన్న దంపతులు

మణుగూరు రూరల్: మణుగూరు మండలం చిక్కుడుగుంటలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్)లో శుక్రవారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న దంపతులు కట్ చేసి అధికారులు, ఉద్యోగులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఈ మాట్లాడుతూ అన్ని మతాల సారం ఒకటేనని, ఎన్ని కులాలు, మతాలు ఉన్నా భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటించడం భారతీయుల ప్రత్యేకత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎం.పార్వతి, డి.శ్రీనివాసరావు, డీ.వీ.రమణమూర్తి, రాంప్రసాద్, రమేష్, రమేష్‌బాబు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు' తప్పనిసరి

ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణానికి జీరో టికెట్లు



జీరో టికెట్ అందిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

ఖమ్మంమామిళ్లగూడెం: రాష్ట్రప్రభుత్వం ఎన్నికల హామీల అమల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గత శనివారం ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించగా ఇప్పటివరకు మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు టికెట్లు కేటాయించకుండానే ప్రయాణానికి అనుమతిస్తున్నారు. ప్రస్తుతం కండక్టర్ల వద్ద ఉన్న టిమ్స్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడం.. ప్రభుత్వం సబ్సిడీ నిధులు విడుదల చేసేలా రోజువారీ ప్రయాణికుల సంఖ్య తేల్చేందుకు గాను శుక్రవారం నుంచి జీరో టికెట్లు జారీ చేస్తున్నారు. ఇక నుంచి మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు తెలంగాణ వాసులుగా గుర్తించేలా ఆధార్ కార్డు లేదా ఏదైనా ధ్రువీకరణ పత్రాన్ని కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. అందరికీ విషయం తెలిసే వరకు ఫోన్‌లో జిరాక్స్ కాపీ చూపించినా అనుమతిస్తామని ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న తెలిపారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా

కొత్తగూడెంటౌన్: గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి పదేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి(స్పెషల్ జడ్జి ఎన్‌డీపీఎస్ యాక్ట్) ఎం.శ్యాంశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. 2022 నవంబర్ 1న పాల్వంచలోని సోములగూడెం పరిధిలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు కారులో వెళ్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా ఉండడంతో పరిశీలించారు. వీరిద్దరు ఖమ్మం దివ్యాంగుల కాలనీకి చెందిన తెల్లబోయిన ఉమేష్, వైరా మండలం రెబ్బవరానికి షేక్ అస్లాంగా తేలగా కారులో రూ.33లక్షలకు పైగా విలువైన 168కేజీల గంజాయి లభించింది. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని తీసుకొస్తున్నట్లు విచారణలో వెల్లడించడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం ఉమేష్, అస్లాంపై నేరం రుజువుకాగా ఒక్కొక్కరికి పదేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ విజయ్‌కుమార్ వాదించగా, సిగ్గా వెంకటేష్, ఎం.హరిగోపాల్ సహకరించారు.

చిట్టితల్లికి అప్పుడే నూరేళ్లు నిండాయి..

భవనం మూడో అంతస్తు పైనుంచి పడి బాలిక మృతి



అంజలి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: అప్పటి వరకు తలిదండ్రులతో ఆడుకున్న చిన్నారి భవవం పై నుంచి కింద పడి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. భద్రాచలం పట్టణానికి చెందిన గోవర్దన్, రేఖ దంపతులు విద్యుత్ పరికరాల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు పట్టణంలోని పాత మార్కెట్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వీరికి రెండున్నరేళ్ల పాప అంజలి ఉంది. గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో వచ్చీరాని మాటలతో సందడి చేస్తోంది. ఈ క్రమంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ భవనం మూడో అంతస్తుపై నుంచి కింద పడింది. తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు. అంజలి దాదాపు 50 అడుగుల ఎత్తు నుంచి కింద పడటంతో గాయాలై తలలో రక్తం గడ్డకట్టింది. దాదాపు 6 గంటలపాటు మృత్యువుతో పోరాడిన చిన్నారి శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతి చెందింది. చిన్నారి మృతితో పాత మార్కెట్ ప్రాంతంలో అంతా విషాదఛాయలు అలుముకున్నాయి.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

అపజయాలే విజయానికి సోపానాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, పక్కన డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, పాఠశాల బాధ్యులు



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న ఖమ్మం సెయింట్ జోసెఫ్ పాఠశాల క్రీడాకారులు

- ఖమ్మం జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- ఘనంగా ప్రారంభమైన 'సెయింట్ ఆన్స్' క్రీడాపోటీలు
- 27 పాఠశాలలకు చెందిన 1,800 మంది క్రీడాకారుల హాజరు

ఖమ్మం స్పోర్ట్స్: ఏ రంగంలోనైనా అపజయాలు సహజమేనని.. వీటితో కుంగిపోకుండా సోపానాలుగా మార్చుకుని విజయానికి కృషి చేయాలని ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో శుక్రవారం 18వ సెయింట్ ఆన్స్ రీజినల్ క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు క్రీడా పోటీల్లో గెలవాలనే ఆశయంతోనే ఉంటారని.. కానీ కొందరికే విజయం దక్కుతుందని తెలిపారు. ఈసేపథ్యాన ఓడిపోయినవారు కుంగిపోకుండా ప్రయత్నిస్తే ఫలితం ఉంటుందని చెప్పారు. కాగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెయింట్ ఆన్స్ పోటీలకు ఖమ్మం వేదికగా నిలవడం మంచి పరిణామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ కె.మరియసుందరి, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడగా డాక్టర్ శౌరీల్లు, సిస్టర్ ఎస్.నక్షత్రం, ఫాదర్ లాజర్, జి.భారతిరాణి, జువితా, సర్వనేని ఉషారాణి, కె.నర్సింహామూర్తి, రమణ, శశికళ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు

సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో సెయింట్ ఆన్స్ క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని 27 పాఠశాలల నుంచి 1,800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరగనుండా డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించేలా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటుచేశారు. ఈమేరకు ఖో-ఖో, కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు మూడురోజుల పాటు జరుగుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.నక్షత్రం తెలిపారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు

- రెండో రోజుకు చేరిన ఆశ్రమ గిరిజన పాఠశాలల పోటీలు
- వివిధ క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు

పాల్వంచ: మండలంలోని కిన్నెరసానిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధి గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన ఏడు జోన్ల నుండి 674 మంది బాలురు, 621 మంది బాలికలు ఎనిమిది క్రీడాంశాల్లో పోటీ పడుతున్నారు. ఈమేరకు డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాలరావు, జోనల్ స్పోర్ట్స్ అధికారులు కె.వెంకటనారాయణ, ఎస్.నాగేశ్వరరావు, బి.రాంబాబు, బి.నెహ్రూ పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో పీడీలు వీరానాయక్, బి.వెంకటేశ్వర్లు, హరికృష్ణ, కె.వెంకటేశ్వర్లు, నాగులు, తారాచంద్, కృష్ణ, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వివిధ పోటీల్లో విజేతలు వీరే

- బాలుర కబడ్డీ సీనియర్స్ విభాగంలో పాల్వంచ, దమ్మపేట, జూనియర్స్ విభాగంలో వైరా, పాల్వంచ డివిజన్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.
- వాలీబాల్ సీనియర్స్‌లో దమ్మపేట, మణుగూరు, జూనియర్స్‌లో ఇల్లెందు, దమ్మపేట డివిజన్లు మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి.
- ఖో-ఖో సీనియర్స్‌లో వైరా, దమ్మపేట, సీనియర్స్‌లో దమ్మపేట, ఇల్లెందు డివిజన్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నాయి.
- ఆర్చరీ సీనియర్స్‌లో ఎం.చరణ్, జి.హర్షకమల్, జూనియర్స్‌లో పి.స్వాతి, డి.సాత్విక్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.
- క్యారమ్స్ సీనియర్స్‌లో వైరా, దమ్మపేట, జూనియర్స్ విభాగంలో ఖమ్మం, దమ్మపేట డివిజన్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.
- చెస్ సీనియర్స్‌లో వైరా, దమ్మపేట, జూనియర్స్‌లో దమ్మపేట, ఇల్లెందు డివిజన్ల క్రీడాకారులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.
- టెన్నికాయిట్ సీనియర్స్‌లో దమ్మపేట, మణుగూరు, జూనియర్స్‌లో దమ్మపేట, మణుగూరు డివిజన్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో దక్కించుకున్నాయి.
- బాలికల అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెం సీనియర్స్‌లో కె.హారిక, ఇ.చందన, జూనియర్స్‌లో బి.దుర్గ, కె.కావ్య మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.
- షాట్‌పుట్ సీనియర్స్‌లో పి.దివ్య, పి.దివ్య, జూనియర్స్‌లో జి.అక్షయ, డి.అమృత మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు.
- లాంగ్‌జంప్ సీనియర్స్‌లో పి.సంధ్యారాణి, ఎం.కావ్య, జూనియర్స్‌లో వై.శృతిహాసిని, టి.మేఘన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.
- బాలికల చెస్ సీనియర్స్‌లో బి.భానుభారతి, సార్థవి, జూనియర్స్‌లో వై.వైష్ణవి, ఎం.తులసి మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు.



కబడ్డీ మ్యాచ్‌లో తలపడుతున్న విద్యార్థులు



రన్నింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు



విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

దివ్యాంగుల క్రీడా ప్రతిభ



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా సంక్షేమాధికారి విజేత



ట్రైసైకిల్ పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు



పరుగుపందెంలో సై..

జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని ఆట పోటీలు నిర్వహించారు. శుక్రవారం కొత్తగూడెం ప్రగతి మైదానంలో ఈ పోటీలు జరగ్గా, పలువురు దివ్యాంగులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్రైసైకిళ్లపై దౌడు తీశారు. రన్నింగ్ పోటీల్లో సత్తా చూపారు. షాట్‌పుట్, క్యారమ్స్, చెస్ తదితర క్రీడల్లో ప్రతిభ చాటారు. రన్నింగ్‌లో డి.శివరాము, నిషా పాతిమా, నందనకృష్ణ, సిహెచ్ రాధిక బహుమతులు గెలుపొందారు. జావెలిన్‌త్రోలో బి.సాగర్, ఆదవి వెంకటరమణ, రాధిక, శివకుమార్ విజయం సాధించారు. షాట్‌పుట్‌లో నవ్య, రాజ్‌కిరణ్ గెలుపోందారు. చెస్ పోటీల్లో ప్రవీణ్‌కుమార్, శివకుమార్, రాజేందర్, క్యారమ్స్‌లో బి.బాబూరావు, కవిత, సౌమ్య, చరణ్ గెలుపొందారు. కాగా పోటీలను జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. మనోబలం ముందు ఎంతటి లక్ష్యమైనా తలవంచాల్సిందేనని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, డీఆర్‌డీఏ డీపీఎం యాదయ్య, విభిన్న ప్రతిభావంతుల సంఘం జిల్లా అధ్యక్షులు జి. సతీష్, దివ్యాంగుల ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు జగ్గుదాస్ తదితరులు పాల్గొన్నారు. -కొత్తగూడెంటౌన్

19న ఫంక్షన్ హాళ్లు, షాపుల వేలం

పాల్వంచ: పాల్వంచ మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) దేవస్థానం పరిధిలోని ఫంక్షన్‌హాళ్లు, షాపులను లీజ్‌కు ఇచ్చేందుకు ఈనెల 19న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణీత రుసుము చెల్లించి షెడ్యూల్ తీసుకోవాలని సూచించారు. ఈమేరకు 1, 2వ ఫంక్షన్ హాళ్ల కోసం రూ.5లక్షల ధరావతు, కాంప్లెక్స్‌లోని పది షాపులకు గాను రూ.50వేల ధరావతును డీడీ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాల కోసం కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కలెక్టర్‌ను కలిసి విన్నవించిన మున్సిపల్ పాలకవర్గ సభ్యులు



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న కొత్తగూడెం మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలోని సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తగూడెం మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కోరారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులందరూ కలెక్టర్ ప్రియాంకను కలిసి విన్నవించారు. మున్సిపాలిటీలో ఆమోదం పొందిన పనులకు టెండరు ప్రక్రియ పూర్తి కాలేదని వివరించారు. 36 వార్డుల్లో తాగునీటి సమస్య నివారణకు పాలకవర్గం ఆమోదించిన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. తొలుత మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, వార్డు సభ్యులు కొలపురి ధర్మరాజు, పరమేష్ యాదవ్, వేముల ప్రసాద్, అంబుల వేణు గోపాల్, బండి నరసింహారావు, రుక్మాంగధర్ బండారి, వై.శ్రీనివాసరెడ్డి, సత్యభామ, గుమ్మడేల్లి కళ్యాణి, కూరపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాన్ని అడ్డుకునేందుకు విప్లవకారుల ఐక్యత

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు



మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు

సింగరేణి(కొత్తగూడెం): దేశంలో పాసిస్ట్ ప్రమాదం ముంచుకొస్తున్నందున అడ్డుకోవడంతో పాటు మారిన పరిస్థితుల నేపథ్యాన విప్లవకారులంతా ఐక్యమై పోరాడాలని నిర్ణయించినట్లు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. కొత్తగూడెంలోని శుక్రవారం ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన మావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రెవెన్యూషనరీ ఇన్షియేటివ్ పార్టీలు విలీనం కాబోతున్నాయని చెప్పారు. మూడు పార్టీలు మారిన పరిస్థితులకు అనుగుణంగా విప్లవోద్యమ నిర్మాణానికి పూనుకున్నాయని తెలిపారు. ఐక్యత కోసం గత ఆరు నెలలుగా జరుగుతున్న చర్చలు ఫలప్రదమయ్యాయని వెల్లడించారు. ఈమేరకు ఐక్యత ప్రకటన చేయడంతో పాటు విధివిధానాలను వెల్లడించేందుకు మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, కెచ్చెల కల్పన, ముద్దా బిక్షం, నాయిని రాజు, గోకినపెల్లి ప్రభాకర్, మాచర్ల సత్యం, జాటోత్ కృష్ణ, అమర్లపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

విప్లవోద్యమంపై దాడులను ఖండించండి

- ఈనెల 22న భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి
- మావోయిస్టు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపు

చర్ల: జార్ఖండ్ - బిహార్ విప్లవోద్యమంపై కొనసాగుతున్న ప్రభుత్వ భద్రతా బలగాలు దాడులను అన్నివర్గాల ఖండిస్తూ ఈనెల 16 నుంచి 22 వరకు ప్రచార, ఆందోళన వారంగా పాటించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మావోయిస్టు భద్రాద్రి కొత్తగూడెం-తూర్పుగోదావరి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ శుక్రవారం ఒక లేఖ విడుదల చేశారు. మావోయిస్టుల అనేక రాష్ట్రాల్లో కొనసాగుతున్న ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి కమాండో బలగాలతో పాటు కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలను మోహరించి ఎడతెరిపి లేకుండా దాడులు చేయిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ దాడులను అసమాన ధైర్య సాహసాలతో ఎదుర్కొంటున్న పీఎల్‌జీఏ, విప్లవ ప్రజాసంఘాలకు విప్లవాభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాగా, ఏడాదిన్నర కాలంగా జార్ఖండ్, బీహార్ అడవులు, ఆదివాసీ గ్రామాలు బాంబుల దాడులతో దద్దరిల్లుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రజల్లో భయానక వాతావరణాన్ని కలిగించేందుకు బలగాలు విచ్చలవిడిగా కాల్పులు జరుపుతున్నాయని మండిపడ్డారు. ఈమేరకు పోరాడుతున్న ప్రజలకు అండగా నిలిచేలా కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి, సంఘాలు సంఘీభావ ఉద్యమాలు నిర్మించాలని ఆజాద్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రచార, ఆందోళనా వారం పాటించడమే కాక ఈనెల 22న భారత్ బంద్‌ను పాటించాలని ఆయన పిలుపునిచ్చారు.

పశువులను తరలిస్తున్న వాహనం స్వాధీనం

భద్రాచలంఅర్బన్: చట్టి ప్రాంతం నుంచి బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరకు అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం భద్రాచలంలో పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో ఉన్న ఆరు పశువులను పాల్వంచలోని అన్నపూర్ణ గోశాలకు తరలించారు.

రెండు బైక్‌లు చోరీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలో పార్కింగ్ చేసిన రెండు బైక్‌లను గురువారం రాత్రి చోరీ చేశారు. సూపర్ బజార్ సెంటర్‌లో కిరణా షాపు వద్ద ఉంచిన బైక్‌ను, మార్కెట్ ప్రాంతం నుంచి మరో బైక్‌ను అపహరించారు. రెండు బైక్‌లను ఇద్దరు వ్యక్తులు పురుషోత్తపట్నం మీదుగా ఆంధ్రాకు తరలించినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. భద్రాచలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్ట్

మణుగూరు రూరల్ : పలు దేవాలయాల్లో, ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మణుగూరు సీఐ రమాకాంత్ కథనం ప్రకారం.. ఇటీవల మండలంలోని రామాలయం, దుర్గాదేవి, వెంకటేశ్వరస్వామి, శివాలయాల్లో చోరీలు జరిగాయి. కాగా అంబేద్కర్ సెంటర్‌లో సీఐతోపాటు ఎస్సై రాజేష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా వేముల రవి అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా పలు ఆలయాల్లో చోరీలు చేసినట్లు అంగీకరించాడు. అతని నుంచి రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు వాహనాల చోరీ కేసులో గతంలో జైలుకు వెళ్లి వచ్చాడు.

బంగారం చోరీ కేసులో..

మణుగూరుటౌన్/మణుగూరు రూరల్ : సురక్షా బస్టాండ్ వద్ద అనుమానంగా కనిపించిన, భద్రాచలానికి చెందిన మద్రి సాయితేజ, నిరంజన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో శ్రీశ్రీనగర్, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి 16 తులాల బంగారం రికవరీ చేశారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సందీప్ (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి: పోక్సో కేసులో శిక్ష పడుతుందనే భయంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడేనికి చెందిన బలగాని సందీప్(20) కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత ఫిబ్రవరిలో ఆయనపై పోక్సో కేసు నమోదైంది. కోర్టులో విచారణ జరుగుతుండగా శుక్రవారం ఆయన వాయిదాకు హాజరుకావాల్సి ఉంది. ఈనేపథ్యాన గురువారం రాత్రి ఇంట్లో సందీప్ ఇంట్లో నిద్రించగా, ఆరు బయటపడుకున్న అన్నావదిన శుక్రవారం ఉదయం ఆరు గంటలకు చూసేసరికి సందీప్ ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. కాగా, మృతుడి చేతులు తాడుతో కట్టుకుని ఉండగా.. ఆయన ఫోన్‌లో 'కేసులో 20 సంవత్సరాలు శిక్ష పడుతుంది.. దానికంటే చనిపోవడమే కరెక్ట్'అని మెసేజ్ టైప్ చేసినా ఎవరికీ పంపించలేదని గుర్తించారు. దీంతో కేసులో శిక్ష పడుతుందనే భయంతోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నా, చేతులకు తాడు కట్టి ఉండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై అంజయ్య తెలిపారు.

మావోయిస్టు కొరియర్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చర్ల : మావోయిస్టు కొరియర్లుగా పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులను చర్ల పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సీఐ రాజగోపాల్ వివరాలు వెల్లడించారు. మండలంలోని దానవాయిపేట గ్రామశివారులో గురువారం వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా మావోయిస్టు పార్టీ కొరియర్, మిలీషియా సభ్యుడుగా తేలింది. అరెస్ట్ చేసిన వారిలో చర్ల మండలం బూరుగుపాడుకు చెందిన సోడి దీపక్, బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగల్‌తురా గ్రామానికి చెందిన కుంజం ఇడమ ఉన్నారు. వారి నుంచి కరపత్రాలు, చెప్పులు, ఆలీవ్‌గ్రీన్ క్లాత్, మందులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.